సాక్షి
శ్రీకాకుళం

సోమవారం : 15 : జులై : 2024



కాటేసే కాలం
ఇది పొలాల్లో పాములు సంచరించే కాలం. అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి.
- 8లో



చిత్తడి నేలలను గుర్తించండి
సోంపేటలో థర్మల్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. జీలను ప్రత్యేకంగా గుర్తించాలని కోరారు.
- 8లో



ముగిసిన అవధానం
జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న అవధాన ప్రక్రియ ముగిసింది. అవధానిని సత్కరించారు.
- 8లో

సాయమా.. గాయమా..?



మత్స్యకారుల వేట నిషేధ కాలం ముగిసి మాసం కావస్తోంది. ఇంతవరకు వారికి అందాల్సిన సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. ఎందుకని ఆరా తీస్తే రీ సర్వే అంటూ కొత్త రాగాన్ని ఎత్తుకుంది. వాస్తవానికి వేట నిషేధ కాలంలోనే వారి ఉపాధికి భృతిగా ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో ఆ సమయానికి సాయం చేయలేకపోయారు. కానీ నెలదాటినా గంగపుత్రులకు వేట నిషేధ భృతి ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- వేట నిషేధ భృతిపై నీలినీడలు
- వేట నిషేధ కాలం పూర్తయినా ఇంకా అందని పరిహారం
- అర్హుల జాబితాపై మళ్లీ రీసర్వే అంటూ మంత్రి అచ్చెన్న ఆదేశం
- గత ప్రభుత్వ హయాంలో మత్స్యకార భరోసా పేరిట ఐదు విడతల్లో రూ.70.61 కోట్లు భృతి పంపిణీ



అరసవల్లి: గంగపుత్రులకు కొత్త ప్రభుత్వం తీరు బెంగ పుట్టిస్తోంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో మత్స్యకారులకు వేట నిషేధం ఉంటుంది. ఆ సమయంలో వారి కుటుంబాల అవసరాలు గడిచేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం ఆ భృతి పంపిణీపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత ఐదేళ్లలో క్రమం తప్పకుండా వేట నిషేధ సమయంలోనే అర్హులైన వారి ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున పరిహార భృతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చింది. దీంతో మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా కాలం గడిచిపోయేది. అలాగే సబ్సిడీతో డీజిల్‌ను కూడా ప్రభుత్వ మే అందించేది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం భృతి మంజూరుపై ఇంకా ఎలాంటి ముందడుగు వేయలేదు. దీంతో పాటు డీజిల్ రాయితీలపై కూ డా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో మత్స్యకారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అధికారంలోకి వస్తే వేట నిషేధ పరిహార భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామంటూ హామీ కూడా ఇచ్చారు. ఈ హామీ అమలుపై కూడా చాలామంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు సర్వే చేసిన సమాచారం మేరకు తాజాగా నిషేధ సమయంలో (2024) 15,300 మందికి రూ.20 వేల చొప్పున మొత్తంగా రూ.30.60 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

మళ్లీ రీ సర్వేనా..?



జిల్లాలో 11 మండలాల పరిధిలో తీర ప్రాంత మత్స్యకారులు వేటపై జీవనాన్ని సాగిస్తున్నారు. ఏటా 15వేలకు పైగా మత్స్యకారులు వేట నిషేధ కాలంలో ఇంటికే పరిమితమయ్యేవారు. ఈక్రమంలో అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యక్ష సర్వే ద్వారా అర్హులను గుర్తించి వారికి పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా అందజేసేవారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రెండు నెలల కిందటే మత్స్యశాఖాధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులను గుర్తించారు. అయితే కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మళ్లీ రీ సర్వే అంటూ కాలయాపన చేస్తోంది. మళ్లీ సర్వే చేయాల్సిందే అని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రకటన చేయడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. 2014–19 మధ్యలో అప్ప టి టీడీపీ ప్రభుత్వం వేట నిషేధ భృతిని రూ.4000 చొప్పున చెల్లిస్తే.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భృతిని రూ.10 వేలకు పెంచుతూ.. వరుసగా 2019 నుంచి 2023 వరకు ఐదు విడతలుగా 70,611 మందికి పైగా వారి ఖాతాల్లోకి రూ.70.61 కోట్లను జమ చేసి చరిత్ర సృష్టించింది.

ఇంకా స్పష్టత లేదు..



వేట నిషేధ సమయంలో పరిహార భృతిని ప్రకటించే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం అర్హుల విషయంలో రీ సర్వే చేయాలని ఆదేశాలు ఇంకా ఇవ్వలేదు. ఉత్తర్వులు వస్తే తగు చర్యలు చేపడతాం. అయితే ఇప్పటికే సుమారుగా 15,300 మంది అర్హులుగా అధికారిక సర్వేలో గుర్తించాం. మళ్లీ రీసర్వేపై ఉత్తర్వులు వస్తే తగు విధంగా చర్యలు చేపడతాం.

– పీవీ శ్రీనివాసరావు, మత్స్యశాఖాధికారి

మత్స్యకారులపై చిత్తశుద్ధి లేదు..



మత్స్యకారులపై కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. వేట నిషేధం పూర్తయి నెలరోజులు దాటిపోయినా.. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మళ్లీ అర్హుల గుర్తింపునకు రీ సర్వే అంటూ జాప్యం చేసేలా కుట్ర పన్నుతున్నారు. ఎన్నికల ముందు ఈ పరిహారాన్ని రూ.20 వేలుకు పెంచి ఇస్తామంటూ అందరికీ ఆశ పెట్టారు. అదెప్పుడు ఇస్తారో తెలీదు. ఏదేమైనా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా రూ.10 వేల చొప్పున భృతి చెల్లించింది.

– కోనాడ నర్సింగరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు

న్యూస్‌రీల్

నేడే కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : కొత్త ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆదివారం రాత్రే ఎస్పీ నగరానికి చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది ఎస్పీలు శనివారం బదిలీ అయిన విషయం అందరికీ తెలిసిందే. ఎస్పీగా కేవీ మహేశ్వర రెడ్డి విధుల్లో చేరనుండటంతో ఇంతకు ముందు పనిచేసిన ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం రిలీవ్ అయ్యి నేరుగా డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయనున్నారు.

జగన్మోహినిగా..



జగన్మోహిని అవతారంలో జగన్నాథస్వామి

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వర ఆలయంలో జగన్నాథ స్వామి ఆదివారం జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

శ్రీ సీతారామ ఆలయ శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఆమదాలవలస: మండలంలోని లొద్దలపేట గ్రామంలో 1926లో స్థాపించిన శ్రీ సీతారామ ఆలయం వచ్చే 2025 సంవత్సరం నాటికి నూరు వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ సభ నిర్వహించి స్వామి వారి వందో కల్యాణం వంద మంది దంపతులతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. శ్రీ సీతారామ లక్ష్మణుల కృష్ణ రాతి విగ్రహాలు తెప్పించి శతాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. ఈ శతాబ్ది ఉత్సవాల సంకల్ప సభలో కొంతమంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు ప్రకటించారు.

పలాసలో భారీ వర్షం



ఎడతెరపి లేని వర్షానికి హైవే బ్రిడ్జి కింద తలదాచుకుంటున్న ప్రయాణికులు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ఆదివారం భారీవర్షం కురిసింది. మందస, పలాస, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉదయం పదకొండున్నర గంటలకు ప్రారంభమై ఒంటిగంటన్నర వరకు కురుస్తూనే ఉంది. దీంతో రోడ్డుపై వెళ్తున్న వారంతా జాతీయ రహదారి వంతెనల కింద తలదాచుకున్నారు.

బయట మందులకే ప్రాధాన్యత

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు బయట మందులు కొనుగోలు చేసుకోమని చెప్పడం చర్చనీయాంశమవుతోంది. ఇక్కడ ప్రతి రోజూ సుమారు 500 వరకు అవుట్ పేషెంట్ విభాగంలో రోగులు వివిధ అనారోగ్య సమస్యలపై వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అయితే కొన్ని రకాల మందులు ఆస్పత్రిలో లేకపోగా, మరి కొన్ని మందులను బయట కొనుగోలు చేసే విధంగా ఓపీ చీటీపై నేరుగా వైద్యులే సూచిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే వారు అధిక మొత్తాన్ని వెచ్చించి బయట మందులు కొనుగోలు చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

పీజీ ప్రవేశాలపై ఆశలు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

- పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి కసరత్తు
- బీఆర్‌ఏయూ పరిధిలో 19 పీజీ కోర్సుల నిర్వహణ
- కొన్ని కోర్సుల్లో తగ్గుతున్న ప్రవేశాలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయంలో పీజీ ప్రవేశాలపై ప్రత్యేక చర్చ జరుగుతోంది. వర్సిటీలో కనీసం ఒక కోర్సు విజయవంతంగా నిర్వహించాలంటే 50 శాతం ప్రవేశాలు జరగాలి. కానీ బీఆర్‌ఏయూలో కొన్ని కోర్సుల్లో ప్రవేశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్సిటీ, అఫిలియేషన్ పరిధి ఆరు పీజీ కళాశాలల్లో సైతం ప్రవేశాలు తగ్గుతున్నాయి. ప్రస్తుతానికి ఈ ఏడాది ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. కొన్ని రోజుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నారు. అయితే ఈ ఏడాది ప్రవేశాలు ఎలా జరుగుతాయన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. డిమాండ్ లేని కోర్సులు, డిమాండ్ కలిగిన కోర్సులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

వర్సిటీ పరిధిలో గత ఏడాది కొన్ని కోర్సుల్లో కనీస ప్రవేశాలు జరగలేదు. ఇద్దరు రెగ్యులర్, ఇద్దరు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్న సోషల్ వర్క్‌లో ఒక్కరు మాత్రమే చేరారు. నెలకు రూ. లక్షల ఖర్చుతో ఈ కోర్సు నిర్వహిస్తున్నారు. మరో పక్క ఈ కోర్సులో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధ ప్రిన్సిపాల్‌గా, మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ కావ్య జోత్స్న ఓఎస్‌డీగా కొనసాగుతున్నారు. మరో పక్క ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, తెలుగు, ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ, జువాలజీ, ఇంగ్లిష్, ఎంఈడీ, ఎంకాం వంటి కోర్సుల్లో ప్రవేశాలు తక్కువగా జరుగుతున్నాయి.

ప్రస్తుతం కొన్నేళ్ల ప్రవేశాలు పరిశీలిస్తే భవిష్యత్‌లో ఈ కోర్సుల మనుగడ సైతం ప్రశ్నార్థకంగా మా రింది. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, తెలుగు, ఎంకాం, ఆర్గానిక్ వంటి కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలల్లో సైతం ప్రవేశాలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంసీఏ, ఎంబీఏ, మైక్రో బయోలజీ, బయోటెక్నాలజీ వంటి కోర్సుల్లో మాత్రమే మెరుగైన ప్రవేశాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రవేశాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

మెరుగైన విద్యా ప్రమాణాలు

వర్సిటీ, అఫిలియేషన్ కళాశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలతో విద్యను అందిస్తున్నాం. కొన్ని కోర్సుల్లో అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఉన్నత విద్యా మండలి ఆదేశాలకు అనుగుణంగా ప్రతి కోర్సులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లక్ష్యంగా సిలబస్‌ల్లో సైతం మార్పులు చేస్తున్నాం. ఈ ఏడాది మెరుగైన ప్రవేశాలకు అవకాశం ఉంది.

– పి.సుజాత, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవి ద్యాలయం.

జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌గా అభిరామ్



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు, జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు

- పురుమల డబుల్స్ చాంపియన్‌గా అభిరామ్–సాయికుమార్
- మహిళల డబుల్స్ చాంపియన్‌గా రోషిని–వైష్ణవిప్రియ
- ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్



హోరాహోరీగా సాగుతున్న పురుషుల డబుల్స్ ఫైనల్స్ పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. స్వర్గీయ నారాయణశెట్టి వెంకట శ్రీనివాసులు (వాసు) మెమోరియల్ పేరిట జరుగుతున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా ఎ.అభిరామ్(ఎస్‌సీబీబీసీ) నిలిచాడు. రన్నరప్‌గా కె.సాయికుమార్(ఎస్‌సీబీబీసీ) నిలిచాడు. అలాగే పురుషుల డబుల్స్ చాంపియన్‌గా ఎ.అభిరామ్–కె. సాయికుమార్ జంట (ఎస్‌సీబీబీసీ) నిలవగా, రన్నరప్‌గా పీజీ సాయిదత్త–భరద్వాజ్ చౌదరి జంట (ఎస్‌సీబీబీసీ) నిలిచింది. మహిళల డబుల్స్ విభాగంలో రోహిణి–వైష్ణవిప్రియ (ఎస్‌సీబీబీసీ) విజేతగా నిలవగా, డీఎస్ సాయిఅఖిల–ఐ.ఆశాలత రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు. అలాగే అండర్–11, 13, 15, 17, 19 వయో విభాగాల్లో శ్రీకాకుళం, పలాస, కవిటి, పాతపట్నం, టెక్కలి, సోంపేట, చాపర, లావేరు, రాజాంకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తాచాటారు.

విజేతలకు బహుమతుల అందజేత..

శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ పోటీలు జరిగాయి. ఆదివారం సాయంత్రంతో పోటీలు ముగియగా.. విజేతలకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, హైదరాబాద్ మ్యాచ్ పాయింట్ అకాడమీ నిర్వాహకులు ముప్పళ్ల వేణుగోపాల్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి బహుమతులు అందజేశారు. రెండు రోజుల టోర్నీ వివరాలను, విశేషాలు, ఏర్పాట్లను బ్యాడ్మింటన్ జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు వివరించారు. కార్యక్రమంలో స్పాన్సర్‌షిప్‌ను అందించిన దాతలు ఎన్వీ కిరణ్‌కుమార్, డాక్టర్ వి.వినోద్‌కుమార్, జి.భీమారావు, బ్యాడ్మింటన్ సంఘ ఉపాధ్యక్షుడు బి.దామోదర్, మదీనాశైలానీ, రత్నాజీ, అనీల్‌కుమార్, సంతోష్‌కుమార్, శాంతికుమార్, జయరాం, మల్లికార్జున్, తారకేశ్వరరావు, డీఎస్ఏ కోచ్ కె.హరికృష్ణ, ఎల్.రవి, చిరంజీవులు, రిజిస్ట్రార్ జి.రవి, రిఫరీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు, పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల సందడి



సూర్యనమస్కార పూజలు చేయిస్తున్న దృశ్యం

అరసవల్లి: సూర్యనారాయణ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. జిల్లా నుంచే కాక ఇరుగుపొరుగు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద భోజనాన్ని కల్పించేలా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి మూలవిరాట్టుకు అలంకరించి పూజలు నిర్వహించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడు ఆదివారం ఉదయం ఆదిత్యుడిని తొలిసారిగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అలాగే వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,10,500, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.75,113, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.80 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

ఆ 'లెక్కలే' వేరు

- కొత్తూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద చిత్రవిచిత్రాలు
- కొలతల్లో తేడాలు



అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద జేసీబీ దోజర్‌తో కొలిచి ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: సాధారణంగా ఇసుకను వే బ్రిడ్జి మీద టన్నుల్లో తూకం వేసి విక్రయిస్తారు. కానీ కొత్తూరు మండలం అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద 'లెక్కలే' వేరు. ఇక్కడ ట్రాక్టర్లు, లారీలకు ఇసుక లోడు చేస్తున్న జేసీబీ దోజర్లను లెక్కించి వాటినే టన్నులుగా నిర్ధారించేసి విక్రయించేస్తున్నారు. దీంతో వినియోగదారులు మోసపోతున్నారు. ఒక ట్రాక్టర్‌కు జేసీబీ దోజర్లు నాలుగు వేస్తే ఐదు టన్నులుగా లెక్కించి టన్నుకు రూ. 340 చొప్పున రూ.1700 తీసుకుంటున్నారు. అదే ఆరు టైర్ల లారీలకైతే 8 దోజర్లు వేసి 10 టన్నులుగా నిర్ధారించి రూ. 3400లు తీసుకుంటున్నారు. ఇసుక వేబ్రిడ్జి మీద తూకం చేసి విక్రయించకపోవడంతో ట్రాక్టర్‌కు నాలుగున్నర టన్నుల ఇసుక మాత్రమే వస్తోందని, కానీ ఐదు టన్నులకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇక్కడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విజయనగరం జోన్ టీమ్‌లో టెక్కలి ఆర్టీసీ ఉద్యోగులు

టెక్కలి: సెప్టెంబర్‌లో ఢిల్లీలో నిర్వహించనున్న ఆలిండియా పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ మీట్ పోటీలకు.. ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ తరపున పాల్గొనేందుకు విశాఖపట్టణంలో నిర్వహించిన ఎంపికల్లో విజయనగర్ జోన్ టీమ్‌లో టెక్కలి ఆర్టీసీ ఉద్యోగులు స్థానం సంపాదించారు. 400 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ విభాగానికి బి.శ్రీరామ్మూర్తి (కండక్టర్) ఎంపికయ్యారు. అలాగే 100 మీటర్ల రన్నింగ్, జావెలిన్ త్రో విభాగానికి ఆర్.విజయకుమారి(కండక్టర్) ఎంపికై నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జోనల్ స్థాయిలో ఎంపికైన వారికి ఆగస్టు 3న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారిని తోటి ఉద్యోగులు అభినందించారు.

● ఉధృతంగా మహేంద్ర తనయ



జిల్లాలో వానలు పడకపోయినా ఒడిశాలో మాత్రం నిండుగా కురుస్తున్నాయి. దీంతో మహేంద్ర తనయ ఉధృతంగా పారుతోంది. పరివాహక ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– పాతపట్నం

● నీరు వెళ్లే దారేదీ..?



గొట్టా బ్యారేజీ వద్ద గుర్రపు డెక్క పేరుకుపోయింది. నీరు వెళ్లేందుకు ఇది అడ్డంకిగా మారుతోంది. ఇటీవలే బ్యారేజీ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీటిని విడిచిపెట్టారు. కానీ ఇక్కడి గుర్రపు డెక్కను మాత్రం తొలగించలేదు.

– హిరమండలం

క్లుప్తంగా

1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని సవర ముకుందాపురం గ్రామంలోని కొండ ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై టెక్కలి, పలాస ఎస్ఈబీ, డీటీఎఫ్ పోలీసులు సమష్టిగా దాడులు నిర్వహించారు. శనివారం ఉదయం నిర్వహించిన ఈ దాడుల్లో 1500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలు ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వినియోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడుతో పాటుగా మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్ ఆవరణలో వృథాగా బైక్‌లు



ఎచ్చెర్ల స్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో పదుల సంఖ్యలో బైక్‌లు పార్కింగ్ చేసి ఉన్నాయి. పోలీసుల తనిఖీల్లో సీబుక్‌లు లేనివి, ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసినవి, రోడ్డు ప్రమాదాల్లో సీజ్ చేసిన వాహనాలు ఉన్నాయి. మరో పక్క ఎన్నికల ముందు కార్డెన్ సెర్చ్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను కూడా స్టేషన్‌కు తరలించారు. కోర్టు పరిధిలో చాలా వాహనాలు ఉన్నాయి. రిలీజ్ ఆర్డర్ ఆధారంగా రిలీజ్ చేస్తున్నారు. బైక్‌లు పదుల సంఖ్యలో ఉండటం, వాటికి ఎలాంటి నీడ, రక్షణ లేకపోవడంతో పాడైపోతున్నాయి.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక వలేసాగరం గ్రామానికి చెందిన మాలతి అనే వివాహిత ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మాలతి తన ఇంటిలో జరిగిన తగాదా కారణంగా మనస్తాపానికి గురై ఆదివారం ఇంటిలో ఉన్న పురుగు మందు తాగేశారు. ఇది గుర్తించిన స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

దేశాయి కాలువ పరిశీలన



అల్లెన గ్రామ దేశాయి చానెల్‌ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారి ఐజీ కుమార్

బూర్జ: మండలంలో గల అల్లెన దేశాయి చానల్‌ను ఇరిగేషన్ అధికారి ఐజీ కుమార్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ఉన్న సమస్యలను నాయకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కాలువ ద్వారా ఏయే గ్రామాలకు ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందో ఆరా తీశారు. కార్యక్రమంలో నాయకులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో హాకీ అభివృద్ధికి కృషి



జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో పరిశీలకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో హాకీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా హాకీ అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంచిరెడ్డి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల రమేష్ పేర్కొన్నారు. హాకీని గ్రామీణ, పాఠశాల స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని చెప్పారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ కార్యాలయ భవనంలో ఆదివారం జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని, అనతి కాలంలోనే హాకీ క్రీడను మరింత ప్రోత్సహిస్తామని, రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని సంఘ పెద్దలు పేర్కొన్నారు. అంతకు ముందు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా రాష్ట్ర హాకీ సంఘం పరిశీలకులుగా జి.రాంబాబు (అనకాపల్లి), జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి శిక్షకులు కె.హరికృష్ణ, అడ్వకేట్‌గా అల్లు రమేష్ హాజరయ్యారు.

నూతన సంఘం ఇదే..

శ్రీకాకుళం జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షునిగా పి.అప్పలనాయుడు, కార్యదర్శిగా జరుగుళ్ల రమేష్, కోశాధికారిగా పంచిరెడ్డి గురునాథం, ఉపాధ్యక్షులుగా సీహెచ్ విజయభాస్కర్, ఎస్.మధు, వై.మనోజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, బి.ఈశ్వర్‌ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా వై.కృష్ణవేణి, కె.బిందు, రవిసాగర్ ఎన్నికయ్యారు.

కాటేసే కాలం



విష సర్పం


- పొలాల్లో పాముల సంచారంపై అప్రమత్తత అవసరం
- అప్రమత్తంగా లేకుంటే అంతే
- మంత్రగాళ్లతో ప్రాణానికే ముప్పు
- ఆధునిక వైద్యమే శ్రేయస్కరం

ఎల్ఎన్ పేట, హిరమండలం:

పొలం పనులు మొదలైపోవడంతో రైతులంతా రోజంతా పొలాల్లోనే గడుపుతున్నారు. ఈ సీజన్‌లోనే అత్యధిక మంది పాముకాట్లకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా వర్షాకాలం వచ్చిందంటే పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. అప్పటి వరకు బొరియల్లో ఉన్న పాములు వర్షం నీరు చేరటంతో బయటకు ఆహారం సేకరించుకునేందుకు ఎలుకలు కోసం సంచారం చేస్తుంటాయి. అలాంటి సమయంలో పొలం గట్లపై తిరిగే రైతులకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

- పొలం పనులకు వెళ్లే రైతులు గట్లపై నడిచే సమయంలో పాద రక్షలు ధరించాలి.
- వీలైనంత వరకు కాళ్ల చెప్పులను కప్పేలా ప్యాంట్లు ధరించడం మంచిది.
- కర్రతో చప్పుడు చేస్తూ నడవటం వల్ల అలికిడికి పాములు దూరంగా వెళ్లిపోతాయి.
- రాత్రిళ్లు సాగునీటి కోసం మోటార్లు వేసేందుకు పొలానికి వెళ్లే రైతులు తమతో పాటు టార్చిలైటు తీసుకుని వెళ్లాలి.
- మోటారు స్టార్టర్ వద్ద పాములు ఉండే అవకాశం ఉంది. గమనించాలి. ధాన్యం గాదెలు, గడ్డి కుప్పలు, కర్రలు, పిడకలు నిల్వ చేసే ప్రాంతాలతో పాటు తేమగా ఉన్న చోట్లకు కప్పలు, ఎలుకలు చేరుతాయి. వాటిని తినేందుకు పాములు అక్కడికే వస్తుంటాయి.
- ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి పిచ్చిమొక్కలు, చెత్తా లేకుండా చూసుకోవాలి.
- కిటికీలకు, తలుపులకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పుడూ తలుపులు, కిటికీలు వేసి ఉంచడం ఉత్తమం.



కొండచిలువ



రక్తపింజర

పాము కాటు వేస్తే..

- విష సర్పాలు కాటు వేసిన శరీర భాగంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా ఉంటుంది.
- గొంతులో ఏదీ దిగని పరిస్థితి ఏర్పడుతుంది. నోటి ద్వారా చొంగ కారడంతో పాటు కళ్లు మగతగా మారి శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.
- రెండు గాట్లు పడితే విషపూరితమైన పాము కాటేసినట్లుగా గుర్తించాలి. తాచు కంటే కట్ల పాము ప్రమాదకరం.
- రక్తపింజర కాటేస్తే విషం రక్తంలో చేరిపోతుంది. నోరు, ముక్కు ద్వారా రక్తం బయటకు వస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.

విషం కన్నా భయమే ప్రమాదం

పాము కాటేసిన తర్వాత విషం కంటే భయమే ప్రాణానికి ప్రమాదంగా మారుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తి అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉన్నందున తనకేమీ కాదన్న ధైర్యంతో ఉంటే ఎంతో మేలు జరుగుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి ఎంత త్వరగా ఆధునిక వైద్యం అందిస్తే అంత మంచిది. పసరు మందులు, నాటు వైద్యం, మంత్ర తంత్రాలు అంటూ ఆలస్యం చేయడం వల్ల ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి నడిపించకూడదు. 108 అంబులెన్స్‌ల్లో తీసుకువెళ్లడం మంచిది. పాము కాటు వేసిన శరీర భాగంలో పైన రక్తప్రసరణ జరగకుండా కట్టు కట్టాలి. అవసరం అనుకుంటే మూడు, నాలుగు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచడం ఎంతైనా మంచిది.

విష పూరిత పాములు

- నాగుపాము కాటేసిన 10 నుంచి 20 నిమిషాల్లో నోటి నుంచి నురగ రావటం, శరీరం మొద్దుబారిపోవటం, ఊపిరి తీసుకోవటం కష్టంగా మారుతుంది.
- రక్తపింజరి కాటేసిన రెండు గంటల్లో విషం శరీరంలో కలుస్తుంది.
- కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తంలో కలుస్తుంది. పాము కాటేసిన వెంటనే వైద్యం అందివ్వటం వల్ల మనిషి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

వెంటనే వైద్యం అందించాలి..



పాము కాటుకు గురైన వ్యక్తిని సమీపంలోని ఆస్పత్రిలో చేర్పాలి. ప్రథమ చికిత్స చేసిన తర్వాత విషానికి విరుగుడు మందును ఇస్తారు. ఆస్పత్రికి తీసుకువెళ్లడం ఎంత ఆలస్యం చేస్తే ప్రాణానికి అంత ప్రమాదం. ఆలస్యం అవుతున్న కొద్దీ విషం రక్తంలో కలిసి శరీరంలో కొన్ని భాగాలు పని చేయకుండా చేస్తుంది. అలాంటప్పుడు వ్యక్తి ప్రాణాలు కాపాడటం కష్టం అవుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి తగిన ధైర్యం చెప్పాలి. పసర మందులు, మంత్రగాళ్లను నమ్మవద్దు.

– డాక్టర్ నీతూ,
ప్రభుత్వ ఆస్పత్రి, తురకపేట, ఎల్ఎన్ పేట

ముగిసిన అవధాన ప్రక్రియ



అవధాని అపర్ణను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో నిర్వహించిన అవధాన ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. అరసవల్లిలోని వైజయంతి ఉత్సవ మండపంలో పులఖండం వేంకటరమణమూర్తి వేదికలో ద్విశతావధాన కళా విలాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. ద్విశతావధాని బులుసు అపర్ణను కళాసమితి తరపున ఘనంగా సత్కరించారు. ముందుగా నాలుగురోజుల పాటు జరిగిన సాహితీ ప్రక్రియలో ప్రాశ్నికులు సంధించిన సమస్యలు, దత్తపదులు, వర్ణనలు, ఆశువులకు మళ్లీ అవధాని అపర్ణ 200 పద్యాలను ధారణ చేశారు. కార్యక్రమంలో విశాఖకు చెందిన డాక్టర్ పేరి రవికుమార్ మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, ఉమామహేశ్వరరావు, పండితులు దోర్భల ప్రభాకర శర్మ, విజయవాడకు చెందిన పంతులు తపస్వి, దండిభోట్ల దత్తాత్రేయ శర్మ, సమితి గౌరవాధ్యక్షులు కొంచాడ సోమేశ్వరరావు, అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, బంకుపల్లి రమేశ శర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, రంపా సాయికుమార్, బంకుపల్లి శంకరం, కొంక్యాణ మురళీధర్, పూజ, పార్థసారధి, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల ఆశలకు తూట్లు పొడిచారు'



టెక్కలిలో జీఓ నంబర్ 54 ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు

టెక్కలి: అధికారంలోకి వస్తే ఓపీఎస్ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు జీపీఎస్ పేరుతో జీఓ నంబర్ 54ను జారీ చేయడం ఉద్యోగుల ఆశలకు తూట్లు పొడవడమేనని ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. ఆదివారం టెక్కలిలో ఉపాధ్యాయ సంఘాలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీఓ నంబర్ 54 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు కె.దాలయ్య మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఓపీఎస్ అమలు చేస్తామని ఎన్నికల మునుపు హామీలిచ్చి ఇప్పుడు అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసే విధంగా జీపీఎస్ పేరుతో జీఓ నంబర్ 54 ను జారీ చేయడం మోసపూరితమన్నారు. ఓపీఎస్ కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను వెన్నుపోటు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు గణపతిరావు, వైకుంఠరావు, కుమారస్వామి, ధర్మారావు, ఖగేశ్వర్రావు, బి.నారాయణరావు, ఎం.రాము, కె.నారాయణవు, బి.జగదీశ్వరరాతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'సునీల్ కుమార్‌పై కేసును ఉపసంహరించుకోవాలి'



ర్యాలీగా వెళ్తున్న ఎయిమ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళంలో అంబేడ్కర్స్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఎయిమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలియజేశారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయడాన్ని వారు తప్పు పట్టారు. నిజాయితీగా పనిచేసే పీవీ సునీల్‌కుమార్ లాంటి అధికారిపై కక్ష సాధింపు సరికాదన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్స్ ఇండియా మిషన్, దళిత జేఏసీ నాయకులు యజ్జల గురుమూర్తి, నరసన్నపేట సర్పంచ్ బూరెల్ల శంకర్, జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పెరుమల్ల తవిటినాయుడు, ఉర్లాం మాజీ ఎంపీటీసీ సతివాడ రామినాయుడు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన శివకుమార్

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బియ్యాని శివకుమార్ (51) అనే వ్యక్తి మృతి చెందారు. ఆయన హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బొప్పాయిపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై శివకుమార్ రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న లారీ ఆయనను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఆయనను హైదరాబాద్‌లోని గొల్కొండ ప్రాంతానికి చెందిన బియ్యాని శివకుమార్‌గా గుర్తించారు. ఇక్కడకు ఎందుకు వచ్చారు, ఎక్కడకు వెళ్తున్నారు వంటి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ–2 ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు.

జ్ఞాపకాల మాలిక



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. ఆనాటి మిత్రులను కలిసి నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. నాడు చదువు చెప్పిన పోలినాయుడు టీచర్‌ను ఘనంగా సత్కరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

'గరిమెళ్ల జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి'



గరిమెళ్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టు నాయకులు

శ్రీకాకుళం: జాతీయ ఉద్యమ కవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సిక్కోలు జల సాధన సమితి అధ్యక్షుడు దుప్పల రవీంద్ర బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక గరిమెళ్ల సత్యనారాయణ భవన్ –ప్రెస్ క్లబ్‌లో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో గాంధీజీ ఇచ్చిన పిలుపుతో చదువును, ఉద్యోగాన్ని త్యాగం చేసి, వ్యక్తిగతంగా ఎన్ని కష్టాలు ఎదురైనా, రాజీలేని జీవితాన్ని గరిమెళ్ల గడిపారని గుర్తుచేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చింతాడ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, గరిమెళ్ల ఉద్యమ జీవితాన్ని వివరించారు.

అంతకుముందు నాగావళి తీరంలోని గరిమెళ్ల విగ్రహానికి జర్నలిస్టులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిత్తడి నేలలను గుర్తించండి

- పర్యావరణ, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు
- సోంపేటలో 14వ అమరవీరుల సంస్మరణ సభ



థర్మల్ స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు

సోంపేట: సోంపేట బీల ప్రాంతంలోని చిత్తడి నేలలను గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు మేరకు గుర్తింపు పొందిన నేలగా గుర్తించాలని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, రెండు తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల కన్వీనర్ వీఎస్ కృష్ణ కోరారు. సోంపేట పట్టణంలో 14వ అమరవీరుల సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ముందుగా థర్మల్ పోరాటంలో మృతి చెందిన అమరవీరులకు థర్మల్ స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అక్కడే ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సోంపేట కళాసీ సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ థర్మల్ పోరాటంలో 56 కేసులు నమోదు కాగా 55 కేసులు కొట్టేశారని, మిగిలిన కేసును కూడా కొట్టేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో 1107 జీఓ రద్దు చేస్తూ విడుదల చేసిన మరో జీఓ 329ను రద్దు చేయాలన్నారు. వీఎస్ కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం చేసిన వారిపై కేసులు పెట్టి, కోర్టుల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. సోంపేట ఉద్యమం ముగిసి పోలేదని, 329 జీఓ రూపంలో ప్రమాదం పొంచి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. చిత్తడి నేలలు కాపాడాలన్నారు. మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు మద్దు రాజారావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల జీవనాధారం చిత్తడి నేలలు అని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనసేన నాయకుడు పాలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వంతో మాట్లాడి చిత్తడి నేలలు రక్షించడంతో పాటు, ఉద్యమ కారులపై ఉన్న కేసులు ఎత్తివేయడానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రధాన శివాజీ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు డోల జగన్, మాజీ జెడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్, ఇచ్ఛాపురం జనసేన సమన్వయ కర్త దాసరి రాజు, పర్యావరణ పరిరక్షణ సంఘ కార్యదర్శి తమ్మినేని రామారావు, సపపల శ్రీరామమూర్తి, జేవీ రత్నం, కేవీ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో క్రికెట్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి హసన్‌రాజ, పక్కనే శైలానీ, రవికుమార్

- జిల్లాలో మూడు మైదానాల కోసం ఎంఓయూలు
- జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి హసన్‌రాజ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో క్రికెట్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని, శ్రీకాకుళం జిల్లా నుంచి ఒక్క క్రీడాకారుడైనా భారత జట్టుకు ఎంపిక కావడమే తమ లక్ష్యమని జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి షేక్ హసన్ రాజ పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆదివారం జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హసన్‌రాజా మాట్లాడారు. జిల్లా చరిత్రలో అత్యద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నామని చెప్పారు. గత దశాబ్ద కాలంగా జిల్లాలో అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు జరగడం లేదని గుర్తుచేస్తూ.. తమ సంఘం బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజుల్లోనే ఏసీ అంతర్ జిల్లాల (నార్త్‌జోన్) అండర్–19, అండర్–23 పురుషుల క్రికెట్ పోటీలను టెక్కలి వేదికగా నిర్వహించినట్టు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నుంచి నార్త్‌జోన్‌కు రెండు ఏజ్ గ్రూపుల నుంచి ఐదుగురేసి చొప్పున ఎంపికయ్యారని వెల్లడించారు. అలాగే ఏసీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏపీఎల్ మొదటి సీజన్‌లో 10 మంది, రెండో సీజన్‌లో ఆరుగురు క్రీడాకారులు వివిధ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించినట్టు తెలిపారు. జిల్లా నుంచి టి.విజయ్‌ను భవిష్యత్ ఆశాకిరణంలా భావిస్తున్నామని, రెండేళ్లలో భారత జట్టుకు ఎంపికే లక్ష్యంగా శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

క్రికెట్ మైదానాలపై ఫోకస్..

జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం, కళింగపట్నం మైదానం, టెక్కలి ఐతమ్ కళాశాల మైదానం ఈ మూడింటినీ తాత్కాలికంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంతో ఈ నెలాఖరులోగా ఎంఓయూ ఫైనల్ అవుతుందన్నారు. జిల్లా క్రికెట్ సంఘం కోశాధికారి మదీనా శైలానీ మాట్లాడుతూ ఎంపికల్లో పారదర్శకత లేదనే ఆరోపణలను ఖండించారు. కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. గత సంఘం 14 ఏళ్ల పాటు చేసిన సమయంలో ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. సమావేశంలో డాక్టర్ సువ్వారి రవికుమార్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, మధు, జీఎస్ఎస్ ప్రసాద్, ఆబోతుల రామ్మోహన్‌రావు, అసిస్టెంట్ కోచ్ అన్నెపు ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.